# చందూ సందేహం

-శ్రీదేవీ మురళీధర్




వేపచెట్టు కింద పడక్కుర్చీలో విశ్రాంతిగా జారగిలపడి కథ చెబుతున్న తాతయ్య ఒళ్లో ముడుచుకుని పడుకుని 'ఊ' కొడుతున్నాడు చిన్నారి చందు. వాడికి మొన్ననే ఏడో ఏడు వచ్చింది.

"అదన్నమాట సత్యహరిశ్చంద్ర మహారాజు కథ. మాట నిలబెట్టుకోవటం కోసం ఆయన ఎన్ని కష్టాలు పడ్డాడో తెలిసింది కదా! అదీ విషయం"

"అంత గొప్పవాడా తాతయ్యా?"

"ఆహా ఈనాటికీ నిజం చెప్పే మంచి వాళ్లందరినీ ఆయన పేరుతోనే పిలుస్తారు. ఆయన నిజాయితీ, సత్యసంధత అలాంటిది మరి" మనవడి తల నిమురుతూ తనతో తానే చెప్పుకుంటున్నట్లు అన్నాడాయన.

"అయితే మనం నిజమే చెప్పాలా తాతయ్యా?" అడిగాడు చందూ తలెత్తి. "అవునురా ముమ్మాటికీ. చెబితే నిజమే చెప్పాలి. గుర్తుంచుకో. అబద్ధం ఎప్పటికీ గెలవదు. ఏదీ చెప్పు... అబద్ధమాడరాదూ"

"అబద్ధమాడరాదు"

"ఎల్లవేళలా నిజమే పలుకవలెనూ"

"ఎల్లవేళలా నిజమే పలుకవలెనూ"

ముచ్చటగా మూడుసార్లు వల్లె వేయించాడాయన మనవడితో.

"ఒరే చందన్నా.. టిఫిను తిందువుగానీ రారా" బామ్మ పిలుపు విని చెంగున తాతయ్య ఒళ్లో నుంచి దూకి లోపలికి పరిగెత్తాడు చందూ.

"అమ్మగారూ.. కాస్త పప్పు పెట్టండి తల్లీ. మా పిల్లోడు పప్పన్నం కోసం ఏడిసి ఆగం చేత్తున్నాడు" పనిమనిషి బామ్మను అడుగుతోంది.

"కావలిస్తే అంత ఊరగాయ పెడతా. తీసుకుపో. ఖర్చు రోజులు. పప్పెక్కడి నుంచి వొస్తుంది, మీ అందరికీ పెట్టడానికి? మేమే చేసుకోవట్లేదు" విసుక్కుంటూంది పొదుపరి బామ్మ. వంటింట్లో గట్టుమీద గోడవారగా పెట్టి ఉన్నది గిన్నెడు దోసకాయ పప్పు. గిన్నెనూ, బామ్మనూ మార్చి మార్చి చూశాడు చందూ టిఫిను తిన్నంతసేపూ.

"అబద్ధమాడరాదు. ఎల్లవేళలా నిజమే పలుకవలెను" తాతయ్య చెప్పిన మాటలు గుర్తుచేసుకుంటూ తుర్రుమని ఆడుకోవటానికి పరిగెత్తాడు.

ఆటల నుంచి తిరిగి వచ్చేసరికి పొద్దుకుంకుంది. స్నానం చేసి పుస్తకాలు ముందేసుకుని చదువుకున్నాడు. తాతయ్య వ్యాసపీఠం పరుచుకుని రామాయణం చదువుకుంటున్నాడు. నాన్న ఆఫీసు నుంచి వచ్చి స్నానం ముగించుకుని కాఫీ గ్లాసుతో వసారాలోకి వచ్చాడు. పీఠం మడిచివేస్తూ "చిల్లరేమైనా ఉందిట్రా అబ్బీ?" అని కొడుకునడిగాడు తాతయ్య.

"లేదు నాన్నా. అన్నీ పెద్ద నోట్లే" చందూ చేతిలో చాక్లెట్లు పెడుతూ అన్నాడు నాన్న. సంతోషంగా అవి తిని లోపలికి వెళ్లిన చందూకి నాన్న గదిలో టేబిల్ మీద గడియారం. కలంతోపాటు ఐదు రూపాయల బిళ్లలూ, రూపాయి చిల్లర కనిపించింది.

"అబద్ధమాడరాదు. ఎల్లవేళలా నిజమే పలుకవలెను"

* * *

"ఎక్కడికెళ్లాడు ఇంతసేపూ?" దీర్ఘాలు తీస్తూ అడిగింది బామ్మ.

తాతయ్య, చందూ లోపలికి వచ్చారు. "ఏదో అలా అలా తిరిగొచ్చాంలే చల్లగాలికి" అన్నాడు తాతయ్య.

"అదే అడుగుతూంట! ఎక్కడెక్కడ తిరిగొచ్చారూ అని" తరచి అడిగింది బామ్మ చేస్తున్న పని ఆపి.

"దిక్కుమాలిన యావ. అన్నీ కావాలి నీకు. పిల్లాడు ఇంట్లో తోచట్లేదంటే ఆంజనేయస్వామి గుడి దాకా వెళ్లొచ్చాం. ఏం చాలా?" విసుగ్గా చొక్కా విప్పి దండెం మీద వేస్తూ వెనుక నడవాలోకి వెళ్లిపోయాడు తాతయ్య.

"ఏరా చందన్నా, నిజమేనా? ఏదీ, గుడికెళ్లి వస్తే ముఖాన అంజనం లేదేం?" పిల్లాడి నుదుటి వంక పరీక్షగా చూస్తూ అడిగింది బామ్మ.

కాల్వగట్టున తాతయ్య స్నేహితులతో సరదాగా చుట్ట కాలుస్తూ కబుర్లు చెప్పుకుంటూంటే తను తోటి పిల్లలతో బొంగరాలు, బిళ్లంగోడు ఆడుకున్న సంగతి చెప్పాలా, వద్దా?

'అబద్ధమాడరాదు. ఎల్లవేళలా నిజమే పలకవలెను'

* * *

"ఏమే అమ్మాయి, టిఫినుకు మినప్పప్పు నానబోశావా?"

"లేదత్తయ్యా. మధ్యాహ్నం బాగా నిద్రపట్టింది. లేచేటప్పటికి ఆలస్యమైంది. రేపు నానబోస్తాను"

"అలాగుటే. పోనీలే"

"అన్నట్లు... మీ అబ్బాయి సినిమాకెళదామంటున్నారు. వచ్చేసరికి ఆలస్యమవుతుంది. మీరు, మామయ్య భోంచేసెయ్యండి"

పప్పు నానబోస్తే సాయంత్రం సినిమాకెళ్లే హడావుడిలో రుబ్బటం కుదరదనీ. అందుకే నానబోయలేదనీ నాన్నతో అమ్మ అంటూంటే అంతకుముందే విన్న చందూ మళ్లీ అనుకున్నాడు..

'అబద్ధమాడరాదు...ఎల్లవేళలా నిజమే పలుకవలెను' అని.

* * *

హరిశ్చంద్ర మహారాజు కథలో ఎన్ని కష్టాలు వచ్చినా ఆయన ఒక్క అబద్ధం కూడా ఆడకుండా కథ చివరిదాకా గడిపాడు. మరి ప్రతి విషయంలోనూ అబద్ధాలు చెబుతూంటే వినటం జరుగుతూంది. ఇదేమిటి?


'అబద్ధమాడవచ్చు' అని అర్థమా?

చేతులు తలకింద దిండులా మడుచుకుని నులక మంచం మీద వెన్నెట్లో పడుకున్నాడు తాతయ్య. తెల్లగా పిండి ఆరబోసినట్లు పెరడంతా పరచుకుని ఉంది వెన్నెల. చల్లనిగాలి నెమ్మదిగా ఉండుండి వీస్తోంటే చెట్ల ఆకులు ఆహ్లాదకరంగా కదులుతున్నాయి. ఆకాశమంతటా చుక్కలు కొలువుదీరి ఉన్నాయి. పౌర్ణమి కాబోలు, చందమామ నిండుగా వెలిగిపోతున్నాడు. తాతయ్య మంచాన్ని ఆనుకుని చిట్టినవారు మంచం మీద పడుకున్నాడు చందూ. వాడి బుల్లి బుర్ర నిండా బోలెడన్ని సందేహాలు.

అవన్నీ విన్న తాతయ్య నోరంతా తెరిచి నవ్వాడు.

"ఆరి వెధవా. హరిశ్చంద్రుడి కథంతా విని, జరుగుతున్నవన్నీ గమనిస్తున్నా? అయితే విను. చెప్తా" గట్టిగా గుండెల నిండా ఊపిరి పీల్చుకుని మొదలుపెట్టాడు ఆయన.

"ఒరే చందన్నా. ఆ రోజులు వేరురా. సత్యకాలం అనేవారు. ఇప్పటి రోజులు వేరు. దీన్ని కలికాలం అంటున్నాం. అసలు మనం రోజూ మాట్లాడుకునేవి అబద్ధాలని ఎవరికీ తోచకుండా పోయిందిరా. కాస్త పప్పు పెట్టమంటే మీ బామ్మ పనిమనిషికి పప్పు వండుకోలేదని చెప్పిందని అంటున్నావు. పప్పు ధర బాగా పెరిగిపోయిందిరా. పదార్థాలన్నీ ఆచితూచి చేసుకోవాలి. ఖర్చులు ఆకాశానికంటుతున్నాయి. ఇవన్నీ చెప్పి 'పెట్టను ఫో' అంటే బాగుండదని అలా చెప్పి ఉంటుంది మీ బామ్మ. నేను చిల్లర డబ్బులడిగితే ఉండి కూడా మీ నాన్న లేదన్నాడనా నీ బాధ? నాకూ తెలుసురా వాడు లేదనే చెబుతాడని. నేను చిల్లర చేతిలో పడితే చుట్టలకి తగలేస్తానని వాడి భయం. నా ఆరోగ్యం బాగా లేదు కదా. డాక్టరు పొగతాగద్దని గట్టిగా చెప్పారాయె. పెద్దముండావాడిని, నాతో



వాదించటం ఇష్టం లేక 'లేవు నాన్నా అన్నీ నోట్లే' అన్నాడు మీ నాన్న.

ఇక మీ అమ్మ బామ్మతో మినపప్పు విషయం అబద్ధం చెప్పిందంటావు? పెద్దవాళ్ల చాదస్తాల నుంచి తెరిపి కోసం చిన్నవాళ్లు అప్పుడప్పుడు అలాగే చెబుతార్లేరా... ఇవేం పెద్ద అబద్ధాల కింద లెఖ్ఖ కాదులే. మీ బామ్మ కూడా మా అమ్మతో అలాగే చెప్పేది!

ఇక మనిద్దరం కాలవగట్టుకి వెళ్లొచ్చిన సంగతి దాచి గుడికి వెళ్లామని మీ బామ్మకి అబద్ధం చెప్పానంటావా!

మీ బామ్మతో నేను చుట్టల కోసం వెళ్లానని చెబితే ఊరుకుంటుందా, చెప్పు. ఎంత సేపని ఇంట్లో పుస్తకాలు చదువుతూ కూర్చోను? నాకు కూడా కాస్త సరదా, కాలక్షేపం కావాలా, వద్దా? మీ నాన్న ఆఫీసుకెళతాడు. నువ్వు బడికీ, ఆటలకీ వెళతావు. మీ అమ్మా, బామ్మా ఇంటిపనీ, ఇరుగుపొరుగులతో సందడిగా గడుపుతారు. అందుకని నిన్ను అడ్డం పెట్టుకుని అలా కాసేపు తిరిగి వచ్చాను.

ఒకరి మంచి కోసం చెప్పేవి, ఒకరికి హాని జరగకుండా ఉండటం కోసం చెప్పేవి. ఎవరికీ చెడుపు చెయ్యనివి అబద్ధాల కోవలోకి రావురా.

ఎటొచ్చీ, ఇన్ని విషయాలలో నేను చెప్పిందే అబద్ధం కిందకి వస్తుంది. నా మంచి కోరే మీ బామ్మకి అబద్ధం చెప్పటం నిజంగా తప్పేనురా.

ఇంకోసారి అబద్ధం చెప్పనులే. అలా వెళ్లి చుట్ట కాల్చుకొస్తానని నిజమే చెబుతాను. అరిస్తే అరిచింది. ఏమంటావు? ఓయ్ చందన్నా?"

పున్నమి చంద్రుణ్ని చూస్తూ అప్పటిదాకా చెప్పుకొస్తున్న తాతయ్య చెప్పటం ముగించి తల పక్కకు తిప్పి చూస్తే ఏముంది? ఆకాశంలోని చందమామ కంటే తెల్లగా, గుండ్రంగా, పాలబుగ్గలతో వెన్నెల్లో మెరిసిపోతూ నిద్రలోకి జారిపోతున్న చందన్న అని ముద్దుగా పిలవబడే పూర్ణచంద్రరావు ముఖబింబం కనిపించింది.

"ఛ... నా దిష్టే తగులుతుంది పసివెధవకి" వాడి ఒంటి నిండా దుప్పటి కప్పుతూ అనుకున్నాడాయన మురిపెంగా.

○